# ట్రైలర్ రిలీజ్ అప్పుడే..!



ప్రభాస్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'సలార్-1'. డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర టీజర్‌కు దేశవ్యాప్తంగా అద్భుతమైన స్పందన లభించింది. స్టైలిష్ మేకింగ్‌తో టీజర్ ఆకట్టుకుంది. దాంతో ఈ సినిమా ట్రైలర్ కోసం ప్రభాస్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను డిసెంబర్ 1న విడుదల చేయబోతున్నట్లు తెలిసింది. అనేక సర్‌ప్రైజ్‌ల సమాహారంగా హై ఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్‌తో ట్రైలర్ ఆకట్టుకోనుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్, శృతిహాసన్, ఈశ్వరీరావు, జగపతిబాబు, శ్రియా రెడ్డి తదితరులు నటించిన ఈ చిత్రాన్ని హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ నిర్మించారు.

# కూతురు ఉంటే బాగుండేది!


నాని

'హాయ్ నాన్న' సినిమాలో నటిస్తున్నప్పటి నుంచి తనకు ఓ కూతురు ఉంటే బాగుండేదనిపిస్తున్నదని హీరో నాని అన్నారు. ఆయన తాజా చిత్రం 'హాయ్ నాన్న' తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. శౌర్యువ్ దర్శకుడు. డిసెంబర్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేశారు. ఇటీవల విడుదలైన 'అమ్మాడి' అనే పాటకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు కూతురు ఉంటే బాగుండేదనే అభిలాషను వ్యక్తం చేశారు నాని. ఆయన మాట్లాడుతూ 'ఇంతకుముందు కూడా నాన్న పాత్రలో నటించాను. కానీ ఈ సినిమా ఎందుకో నా హృదయానికి దగ్గరైంది. ఆడపిల్ల తండ్రి తాలూకు ఉద్వేగాలు ఏమిటో అర్థం చేసుకున్నా. నాకు మొదటి నుంచి ఆడపిల్లలంటే ఇష్టం. ఈ సినిమాలో నటించడం మొదలుపెట్టాక ఆ ఇష్టం మరింత పెరిగిపోయింది. ఇప్పుడు నాకు ఓ కూతురు ఉంటే బాగుండేది కదా అనిపిస్తున్నది' అని చెప్పారు నాని.

# మంచిపని కోసం ఉపయోగిద్దాం!


కీర్తి సురేష్

అగ్ర కథానాయిక రష్మిక మందన్న మార్ఫింగ్ వీడియో సంఘటనపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతున్నది. సాంకేతికతను దుర్వినియోగపరుస్తూ వికృత చేష్టలకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని పలువురు సినీ ప్రముఖులు డిమాండ్ చేశారు. తాజాగా ఈ ఘటనపై కీర్తి సురేష్ స్పందించింది. నేటి రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానం వరమో శాపమో అర్థం కావట్లేదని, సోషల్‌మీడియాను మంచి పనుల కోసం ఉపయోగిస్తే సమాజం బాగుంటుందని హితవు పలికింది. ఆమె మాట్లాడుతూ 'నిజంగా ఇలాంటి ఫేక్ వీడియోలు చూస్తే భయమేస్తుంది. టెక్నాలజీ సహాయంతో ఎదుటివారిని ఇబ్బంది పెట్టే బదులు..ఆ సమయాన్ని మంచి పనుల కోసం ఉపయోగించుకోవాలి. సమాజంలో ఆశావహ దృక్పథాన్ని, ప్రేమను పెంపొందించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను ఉపయోగించాలి. అంతే కాని ఇలాంటి చెత్తను షేర్ చేస్తూ రాక్షసానందం పొందడం కోసం కాదు' అని కీర్తి సురేష్ ట్వీట్ చేసింది.


మోహన్‌బాబు, శరత్‌కుమార్

# 'కన్నప్ప'లో మోహన్‌బాబు

మంచు విష్ణు టైటిల్ రోల్‌ను పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో వివిధ భాషలకు చెందిన అగ్ర తారలు భాగమవుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ భక్తిరస ప్రధాన చిత్రంలో ప్రభాస్, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ వంటి స్టార్ హీరోలు కీలక పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాలో సీనియర్ నటులు మోహన్‌బాబు, శరత్‌కుమార్ సైతం భాగం కాబోతున్నారు. వీరిద్దరి పాత్రలు కథాగమనంలో కీలకంగా ఉంటాయని చిత్ర బృందం పేర్కొంది. త్వరలో ఈ ఇద్దరు అగ్ర నటులు 'కన్నప్ప' సెట్స్‌లో జాయిన్ కాబోతున్నారు. అపర శివభక్తుడు కన్నప్ప జీవిత చరిత్రతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. న్యూజిలాండ్‌లో చిత్రీకరణ జరుగుతున్నది.

# మనసును తడిమే కథ..

'తెలుగు ప్రేక్షకులు నాపై ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. శ్రీమన్నారాయణ, 777 ఛార్లీ, సప్తసాగరాలు దాటి సైడ్ ఏ.. చిత్రాలను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు 'సప్తసాగరాలు దాటి సైడ్ బి' కూడా మిమ్మల్ని మెప్పిస్తుంది' అన్నారు రక్షిత్‌శెట్టి. ఆయన కథానాయకుడిగా నటించిన 'సప్తసాగరాలు దాటి సైడ్ ఏ' చిత్రం గత సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. తాజాగా ఈ సినిమా రెండో భాగం ఈ నెల 17న విడుదల కానుంది. పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. రుక్మిణీ వసంత్, చైత్ర జె ఆచార్ నాయికలుగా నటించిన ఈ చిత్రానికి హేమంత్‌రావు దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'రెండో భాగం చాలా భిన్నంగా ఉంటుంది. తొలిభాగానికి కొనసాగింపుగా కథ నడుస్తుంది. హృదయాన్ని స్పృశించేలా సన్నివేశాలుంటాయి' అని చెప్పారు. మను, ప్రియ జంట ప్రణయగాథ మనసులను హత్తుకుంటుందని కథానాయిక రుక్మిణీ వసంత్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో నిర్మాత వివేక్ కూచిభొట్ల పాల్గొన్నారు.


రుక్మిణీ వసంత్, రక్షిత్‌శెట్టి. చైత్ర జె ఆచార్






FARNAZ




